
## ఆ రోజు బాగా వర్షం కురిసింది.

### వర్షం— అవును;

ఆకాశపు ఆశీర్వచనంలాంటి వర్షం. మరీ ముఖ్యంగా, దేశం అంతా వానలు లేక, జనం అల్లాడి పోతున్న ఈ రోజులలో వర్షం ఈ గడ్డురోజులలో ఏపాటి వాన జల్లు కురిసినా, తపించిన లక్షలాది జనానీకానికి హర్షం కలిగించే వర్షం—.




అవునా, తలమీద ఒక గూడంటూలేని అనాథ లకి ఈ వాన నిజంగా ఆనందం కలిగిస్తుందా? అని మరో చివుక్కుమనే ప్రశ్న.

మంచివాన విసిరి, విసిరి, అప్పుడే వెలిసింది. బెజవాడలో బెంజికంపెనీ సెంటర్లో ట్రాఫిక్ సంచలనం వేగంగా పుంజుకుంటోంది. లారీలు, చిన్న కార్లు, ఆటో రిక్షాలు, స్కూటర్లు, మోపెడ్లు, వ్యాన్లు— ఇటూ అటూ సందడిగా పరుగులు తీసే జనం-

ఒకటే సందడి-

అక్కడొక ధ్వనుల తరంగం లేచింది. అసలే సందడిలో ఈ ధ్వనుల కోలాహలం మితిమీరిన పోగొట్టే లాగుంది.

ధ్వని అనేది ఈనాటి అభివృద్ధికే సంకేతమా అనిపించింది. ఎక్కడ చూసినా ధ్వనులు! ధ్వనులు!! బాటల మీద, వీధులలో, కల్యాణ మండపాలలో, దేవాలయాల్లో, మసీదుల్లో, చర్చిలలో, ఆశ్రమాలలో, అన్ని రకాల సభా ప్రాంగణాలలో, రాజకీయ, తాత్త్విక, సామాజిక, సాంస్కృతిక, మత ధ్వనులు. మూగవాళ్ల 'సంఘం వార్షిక సమావేశం జరిగినా లౌడ్ స్పీకర్లు తగిలించి నగరంలో 'ధారాపాతం'గా మాట్లాడగలిగిన వక్తల్ని ఆహ్వానించి, వాళ్ల సమస్యల గురించి మాట్లాడించ కుండా వదలరు కదా!

సరిగ్గా— అటువంటి ధ్వనుల కలకలం నలువైపులా వ్యాపించి పోయిన రోజది. దగ్గరలోనే వున్న సభా భవనంలోంచి ఏదో సమావేశానికి జనాన్ని ఆకర్షించడాని కనుకుంటాను చవక బారు సినిమా పాటల హోరు, అసలే గజి'బిజీ'గా వున్న ఆ సెంటర్ని మరింత గజిబిజి చేస్తోంది.

మబ్బులు చెదిరి ఆకాశంలో వెలుగు ఆవరించింది. వరుణదేవుడు వాన కోరే వాళ్ళని దగా చేసి పోయాడు. కూటి పేదల్ని, గూడులేని వాళ్లని, కాసేపు కలవరపరిచి పోయాడు. అస్తమించే సూర్యకాంతి కునికే దీపం చివరి వెలుగులాగుంది.

నేను బందరు రోడ్డు మీదుగా నడిచి ఆ సెంటరుకి ఎడంగా ఒక పక్కగా వున్న పెట్రోల్ బంకు దగ్గర నిలబడ్డాను. నలువైపులా చూస్తున్నాను. నాకు ఎడం చేతివైపున జాతీయ రహదారి. ఎదురుగా బందరు పోయే రోడ్డు. కుడిచేతి వైపు కృష్ణలంక వైపు వెళ్ళే రోడ్డు- మధ్యలో అందంగా పూలు పెరిగి, ఫౌంటెన్ దరహాసాలు చిలికే నాగరికం నిండిన ట్రాఫిక్ ఐలెండ్-

హఠాత్తుగా నాకంటికి ఎదురుగా, తడిసి చివికిన వెదురు కర్రలాంటి ఒక మానవాకారం ఆకూడలిలో అవతల పక్క కనిపించింది. కృష్ణ లంక వైపు రోడ్డు మీదికి వెళ్ళాలని కాబోలు, ట్రాఫిక్ ఐలెండ్ మలుపు తిరుగుతున్నాడా మనిషి.

శల్యావశిష్టంగా వున్న అతని కుడిచేతిలో భారంగా ఒక ఊతకర్ర, ఎడం చేతిలో ముష్టి మూకుడు. అదే అతని సంపద. గుండెలకు పదిలంగా అదుముకుని మరీ నడుస్తున్నాడు. అడుగు సరిగా పడక తడబడుతున్నాడు.


వాహనాలు నడుపుకుంటూ వెళ్లే వాళ్లు కొందరు అతన్ని కూకలేస్తున్నారు, అడ్డం వచ్చినందుకు. కొంద రైతే పాపం, దయదలిచి తమ బళ్ళ వేగం తగ్గించి తప్పుకు వెడుతున్నారు. సైకిళ్ల బాబులు కొందరు బ్రేకులు వేసి, కసురు కుంటున్నారు.

'అతను ఏమైపోతాడా!' అని నేను ఊరికే చూస్తూ నిలుచున్నాను. ఎవరా మనిషి? అతని గమ్యం ఎక్కడికి? నాది వట్టి కుతూహలం, అంతే. నా సంపాదక మిత్రుడికి, నేను వృత్తి ధర్మంగా ప్రతి సూక్ష్మాంశం చెప్పాలనే కుతూహలం. నా గుండె ద్రవించి పోతోంది. అయినా, ఆ మనిషిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నానంతే.

అతనా మలుపు దాటాడు. విర్లిప్తంగా వున్నాడు. అసలే నాలుగు రోడ్ల కూడలి అది. చీకటిపడేవేళ గనక జనం అంతా ఎవరి హడావిడిలో వాళ్ళు ఈ నాగరికత మీద నుంచి ప్రవహించి పోతున్నారు. ఆ మనిషికి ఏదో ఘోరం జరగడం తథ్యమని నా కనిపిస్తోంది. నా కాళ్ళలో వణుకు పుట్టింది. 'కోల్పోయేందుకు నాకేం వుంది గనక!' అన్నంత దిలాసాగా — చివికి చీదరై పోయిన ఆ మనిషి వణుక్కుంటూ పోతుంటే, చూస్తూ నిలబడడం, చూసేవాడి కెంత అలుసట!

అనుకున్నంతా అయింది. కృష్ణలంక రోడ్డు మీదికి వెళ్ళవలసిన అతను, ఒక పక్కగా — కర్ర ఒక వైపు, ముష్టిమూకుడు ఒకవైపు జారవిడిచి — ఆ తడి నేల మీద ఒరిగిపోయాడు. భుజం మీది మురికి తుండు పరిచినట్టు పడింది.

నాకు ఆరాటం ఆగలేదు. అప్పటికి అప్రయత్నంగా నేను నా కుడిచేతివైపు నడిచి అటున్న పెట్రోల్ బంక్ మీదుగా వెళ్ళాను. పడిపోయిన అతనికీ, నాకూ మధ్య



పది, పదిహేను గజాల దూరం వుంది. ఆతృతగా చూస్తున్నాను. ఏదో చెయ్యాలని వుంది. ఏం చేయాలి?

తలెత్తి మళ్ళీ చుట్టూ చూశాను. నేను నిలబడ్డ చోటుకి ఎడం వైపు దూరంగా, ఎదురుగా 'నాస్తిక కేంద్రం' బోర్డు గుర్తుకు వచ్చింది. అక్కడివాళ్ళకు దేవుడి మీద నమ్మకం లేకపోయినా, సాంఘిక సేవా కార్యక్రమాలలో దీక్షగా పనిచేస్తారనీ, పీడితులను, తాడితులను ఆదుకుంటారనీ విన్నాను. వాళ్ళ ధార్మిక కార్యకలాపాల గురించి రోజూ ఏదో ఒక వార్త వింటూనే వున్నాను.

నాలో ఒక ఆలోచన మెరిసింది. ఈ దిక్కులేని మనిషి గురించి, అక్కడకు వెళ్ళి చెపితే ఎలావుంటుంది? అక్కడెవర్నీ నే నెరగను. నసుపు ఎవరితోనూ లేదు. ఆ కుటుంబం వాళ్ళలో ఒకరిద్దర్ని అప్పుడప్పుడు సభల్లో, సమావేశాలలో కలిసిన ముఖపరిచయం వున్నా, అది 'హలో, బాగున్నారా!' అని పలకరించేపాటి పరిచయమే. మరి, ఎలా అక్కడకు వెళ్ళి చెప్పడం? మరొక సందేహం కూడా తలెత్తింది. మన కేమీ సంబంధం లేని ఒక మనిషి గురించి ఏమని చెప్పడం?

వాళ్ళు అతను మీకేమవుతాడని అడిగితే? — సరే, వెళ్ళి చెప్పానే అనుకుందాం. "ఇక్కడికి తీసుకురండి" అని వాళ్ళంటే తీసుకు వెళ్ళడం ఎలా? ఏమిటి సాధనం?

అరరే, ఈ మనిషి గురించి ఎవరికి చెప్పాలి? నాకు సాయపడేవాళ్ళెవరు? ఇంకో ఇద్దర్ని ఆపి సాయం కోరితే!?

ఇది బాగుంది. ఇంకొకరితో చర్చించి ఏదైనా చేయవచ్చనిపించింది. సరిగ్గా — అనుకున్నానో లేదో బందరు రోడ్డు వైపు నుంచి ఒకాయన ఇటే వస్తూ నా దృష్టిని ఆకర్షించాడు. నాగరీకంగా, నీట్‌గా డ్రస్ చేసుకున్నాడు. అడిగేద్దాం. ఫర్వాలేదు. ఈయనెవరో మంచి మనిషిలాగే కనిపిస్తున్నాడు.

# అరుణోదయ వర్ణాలు...!



అమావాస్య చీకటిలో
అరుణోదయ వర్ణాలు...!
అంబర వీధుల నిండుగ
అంతులేని అందాలు...!!

మతాబాల వెలుగులలో
పసిపాపల చిరునగవులు...!
మింటి కెగయు జువ్వలలో
మిసిమి వయసు పరుగులు...!!

బారులు తీరిన ప్రమిదలలో
ప్రమదల బంగరు స్వప్నాలు...!
అమావాస్య చీకటిలో
అరుణోదయ వర్ణాలు...!!

—జె.ఎస్.వి. ప్రసాద్

ఇలా ఆలోచిస్తూనే — పడిపోయిన ఆ మనిషి వున్న వైపు చూశాను. కదలక మెదలక వున్నాడు. నాలుగైదు గజాల దూరం అటుగా నడిచాను. ఒక కుక్క ఆ మనిషి దగ్గరగా వచ్చి, ముష్టిమూకుడులో తనకేమైనా దొరుకుతుందేమోనని తాపత్రయపడుతోంది. అది ఆ మనిషి నేమీ చేయకుండా దూరంగా తరమాలి. వంగి ఒక రాయి తీశాను. రాయి ఆ మనిషికి తగలకుండా కుక్కకే తగిలేలాగా జాగ్రత్తగా విసరాలని నా ఉద్దేశం.

అయితే — ముష్టి మూకుట్లో తనకేం దొరక్క, ఆ మనిషి వైపు ఒక నిరసన చూపు విసిరి ఆ సెంటరుకి రాజులాగా ఆ కుక్క ఠీవిగా వెనక్కి వెళ్ళిపోయింది. చేతిలో రాయిని చల్లగా జార్చేశాను.

ఆప్పటికి — నేను చూసిన 'మంచి మనిషి' నాకు దగ్గరగా వచ్చాడు. నేను వంగడం, రాయి తీసి కుక్కను తరమాలనుకోవడం, దూరం నుంచి బహుశా గమనించే వుంటాడు. ఈ ముష్టి మనిషికీ, నాకూ ఏదో బాంధవ్యం వుందనుకునే వుంటాడు. ఆయనను ఆపాను — "జస్ట్ ఎ మినిట్ ప్లీజ్".

"ఎస్, వాట్ కెన్ ఐ డూ?"

"మరేం లేదు, చూడండీ ... ఆ మనిషి పడి పోయాడు ..."

"ఓ, దట్సాల్ రైట్" అని ఆయన జేబులోంచి రెండు రూపాయిల నోటు తీసిస్తూ. — "డూ సమ్ థింగ్ - అయాం ఇన్ ఎ హ్రీ" అన్నాడు.

"మీరు మరోలాగ అనుకోకండి... సార్.. ఏమండీ.."

ఆయన వెళ్లిపోయాడు. ఆయన నన్ను గురించి ఏమనుకుని వుంటాడు? ఆ ముష్టి మనిషి కోసం చందాలు వసూలు చేస్తున్నాననుకున్నాడా?- నా మనస్సు చివుక్కుమంది- ఏమీ పాలుపోవడం లేదు.

అక్కడ పడిపోయిన ముష్టిమనిషి-

ఇక్కడ నా చేతిలో రెపరెపలాడుతూ రెండు రూపాయిల కాగితం! సిగ్గనిపించింది. కాని కదలలేకపోయాను. మళ్లీ చుట్టూ చూశాను. ఈ పెద్దమనిషి వచ్చిన వైపు నుంచే ఈ సారి ముగ్గురు కబుర్లు చెప్పుకుంటూ ఇటే వస్తున్నారు. వీళ్ళనైనా ఆపి, ఆ మనిషి సంగతి చెప్పి, చర్చించి ఏదో చెయ్యాలనిపించింది.

వాళ్ల దగ్గరకు రాగానే ఆపాను- "చూడండి మాస్టారూ, పాపం ఆ మనిషి అక్కడ పడిపోయాడు. అనాధలా వున్నాడు" అని, ఇంకా చెప్పబోతున్నాను. వాళ్లలో ఒకతను - "ఏమిటయ్యా నీ గోల!" అన్నట్టు విసుగ్గా చూసి - "చూడండి మాస్టారూ, మా ముగ్గురిలో ఇద్దరు అనాధలున్నారు. ఎవరికి పట్టిందీ?- మేం అర్జంటు పని మీద పోతున్నాం" అన్నాడు.

"అది కాదు... ఒక మనిషి అలా..." నా మాట పూర్తిగా వినిపించుకోకుండానే అతను- "మీ పనేదో మీరు చూసుకుందురూ, ఎవర్ని ఎవరు ఉద్ధరించ గలరు?- కాదంటే, మీరే ఏదైనా చెయ్యండి. మాకు వేరే పనుంది" అనేశాడు. ఆ ముగ్గురూ వెళ్లిపోయారు-

అప్పటికి కాస్త చీకటి అలుముకుంటోంది. ఆ మనిషి అలాగే పడివున్నాడు.

నా మీద నాకే చికాకు వేసింది. నేను అనవసరంగా ఇక్కడ ఇరుక్కున్నాననిపించింది. నా చేతిలో ఆ దాత ఎవరో ఇచ్చిన రెండు రూపాయిల నోటొకటి!

నా జేబులో రూపాయి వుంది. అదీ, యిది కలిపి - పడిపోయిన ఆ మనిషి దగ్గరకు వెళ్లి ముష్టి మూకుట్లో వేయడానికి వంగాను. ఈ స్థితిలో నన్ను చూసి ఎవరే మనుకుంటున్నారో అని మనస్సు పీకుతుంది. వేసేశాను.

మనిషి అలాగే వున్నాడు. బరువుగా ఊపిరి తీస్తున్నాడు. నా మనస్సు గిలగిలలాడింది. ఉండి, ఏమైనా చేయడమా? వెళ్లిపోవడమా? మళ్లీ దిక్కుమాలిన శంక!

నాస్తిక కేంద్రానికి వెళ్లి ఏమైనా సరే అక్కడి వాళ్లకు చెప్పడానికే నిశ్చయించి గబగబ అటువైపు నడిచాను. ఆ మనిషి దగ్గర్నుంచి ట్రాఫిక్ ఐలాండ్ మలుపు తిరుగుతూ, కొంత దూరం వెళ్లి వెనక్కి చూశాను.

ఆ మనిషి దగ్గర తెల్లని దుస్తుల్లో ఇద్దరు స్త్రీలు దేవతల్లా నిలబడి వున్నారు. వారిలో ఒకామె పరుగు వంటి నడకతో గబ గబ పక్కన ఆటో రిక్షాలు ఆగిన వైపు వెళ్లింది. నేను వేగంగా వెనక్కి వచ్చాను.

అప్పటికే ఆటో రిక్షా వచ్చింది. డ్రైవరు సాయంతో ఆడవాళ్లిద్దరూ ముష్టి మనిషిని ఆటోలో ఎక్కించి, చెరొక వైపునా కూర్చుని, తమ ఒళ్లో పడుకోబెట్టుకున్నారు. ఆ స్పర్శలో మానవత్వపు వెచ్చదనం అతనికి ఊరట కలిగించి వుంటుంది.

అప్పటికి నేను ఈ దృశ్యం చూస్తూ బందరు రోడ్డు వైపుగా ట్రాఫిక్ ఐలెండ్ మలుపు తిరిగి ఎడం చేతివైపు పెట్రోల్ బంకు వంపు దగ్గర ఆగాను.

ఆటో డ్రైవరు నా ఎదుట నుంచి వేగంగా కోసి, కాండ్రించి రోడ్డు మీద ఉమ్మేడు. నా కెందుకో - 'ఛీ' అని నా మొహమ్మీద ఉమ్మినట్టనిపించింది.

అనిపించిందంతే- అతను నన్నేమీ ఎరగడు. ●

